


**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

# ఘంటసాల

*(విజయచిత్ర 1967 జనవరి సంచిక నుంచీ పునర్ముద్రణ)*



**"అతనికేం అదృష్టవంతుడు –"**

"అతనికేం చక్కని గాత్రం –"

"అతనికేం పెట్టి పుట్టినవాడు –"

అంటారు కొందరు ఘంటసాలను చూసి. అయితే ఘంటసాల వెంకటేశ్వరరావు "అదృష్టవంతుడు" కాదు శక్తిసామర్ధ్యాలను రుజువు చేసుకుంటూ, కృషిచేసి పైకి వచ్చిన వ్యక్తి. అతని గాత్రం చక్కనిదే ఐనా ముందు రోజుల్లో దాన్ని ఆదరించేవాడే లేడు. ఘంటసాల "పెట్టిపుట్టినవాడు" అంతకన్నా కాదు. చెప్పొచ్చేదేమిటంటే కేవలం అదృష్టంవల్లనే ఘంటసాల "ఘంటసాల" కాలేదు. అద్భుతమైన కంఠ బలం, సంగీత విద్యా బలం వున్నా, మొదటిరోజుల్లో అతను ఎక్కడా జయించలేకపోయాడు. అలాంటి అపజయాలకూ, నిరుత్సాహాలకూ లొంగిపోకుండా, అదృష్టాన్ని అంతకన్నా నమ్ముకోకుండా కేవలం తన శక్తినీ, గాత్రశక్తినీ నమ్ముకుని పైకి వచ్చి చిత్ర తారాగణంతోపాటు నేపథ్యంలో వున్న తన పేరుకు కూడా 'స్టార్‌వాల్యూ' తెచ్చుకున్న వ్యక్తి ఘంటసాల.

ఘంటసాల జీవితశకటం ఎలాంటి గతుకురోడ్లమీద ప్రయాణం చేసిందో చెబితే, ఇవాళ సిమెంటు రోడ్డుమీద సాగిపోతున్న అతని జీవితరధాన్ని చూస్తున్న వాళ్ళు ఎవరూ నమ్మరు.

వెంకటేశ్వరరావు తలిదండ్రులు రత్తమ్మగారూ, సూర్యనారాయణ గారు. ఘంటసాల 1922 డిసెంబరు నాలుగవ తేదీన గుడివాడ తాలుకా చౌటపల్లి గ్రామంలో జన్మించాడు. సూర్యనారాయణగారు సంగీతం తెలిసినవారు. ఆయన తానుగా మృదంగం వాయిస్తూ, తరంగాలు పాడుతూ వుంటే వెంకటేశ్వరరావు నృత్యం చేసేవాడు. ఆ నృత్యాన్ని చూసిన ప్రజానీకం ఎంతో ముచ్చటపడేది. పదో ఏడు రాకపూర్వమే ఘంటసాలకు బంగారు పతకాలూ, 'బాలభరతుడు' అనే బిరుదూ వచ్చేశాయి. నాలుగోఫారం చదువుతూ వుండగా, తండ్రిగారు స్వర్గస్తులు కావడంతో ఘంటసాల జీవితం తెగిపోయిన గాలిపటం అయిపోయింది.

చదువూ సరిగా లేదు. సంగీతమూ సరిగా లేదు. ఏది సాగుతుందో తెలీదు. ఎలా సాగుతుందో తెలీదు. చదువుకంటే అతనికి సంగీతంమీదే ఎక్కువ ఆసక్తి వుండేది. రామనాధశాస్త్రి పద్యాలూ పాటలూ పాడుతూ, నాటకాల్లో వేషాలు సంపాయించాడు. 'చింతామణి ', 'సక్కుబాయి ' మొదలైన నాటకాల్లో వేషధారణ చేశాడు. ఓ రెండేళ్ళు అలా గడిచాయి. ఘంటసాలకు తన గాత్రం మీద, సంగీత సాధనమీదా నమ్మకం కలిగింది. ఎప్పుడో ఇలా నాటకాల్లో వేషాలు వేసేకంటే, పూర్తిగా సంగీతం నేర్చుకుంటే కచేరీలు చేసుకోవచ్చును. పాఠాలు చెప్పుకోవచ్చును అనుకున్నాడు. అనుకోవడమేమిటి అతను పెదకళ్ళేపల్లికి మూటాముల్లే కట్టాడు. సుసర్ల కృష్ణ బ్రహ్మశాస్త్రిగారు అనే సంగీత విద్వాంసులు ఆ వూళ్ళో వుంటున్నారు. వెంకటేశ్వరరావు ఆయనకు శుశ్రూష చేస్తూ వూళ్ళో వారాలు చేసుకుంటూ సంగీతం నేర్చుకున్నాడు. అలా ఏడాది దాటి పోయింది గాని తన సంగీత సాధన, గీతాలు దాటలేదు. ఎంతసేపూ గురువుగారికీ ఆయన పిల్లలకూ సేవ చెయ్యడంతోనే సరిపోయేది అతనికి.

ఇంక లాభం లేదనుకున్నాడు వెంకటేశ్వరరావు. ఆ గురువుగారికీ ఆ వూరివారికీ వీడ్కోలు చెప్పి కొడవల్లి గ్రామం చేరాడు. కొడవల్లిలో ఘంటసాల నాగభూషణంగారుండేవారు. ఆయన వెంకటేశ్వరరావుకు బంధువు. అంచేత ఆయన తనకు శ్రద్ధగా నేర్పుతారనే ఉద్దేశంతో అక్కడ చేరాడు. ఐతే, ఈసారి ఘంటసాల "వంటశాల"లో పడ్డాడు. వచ్చేపోయే జనానికి, వండడమూ వడ్డించడంతోనే సరిపోయింది అతని జీవితం. ఐనా పెద్ద వర్ణాలదాకా వచ్చాడు. కొడవల్లికి దగ్గర్లోనే వున్న పాలకోడేరులో కొంతమంది కుర్రవాళ్ళకు 'సారంగధర' నాటకాన్ని తర్ఫీదు యిస్తూవుంటే, వాళ్ళు ఏదో ముట్టచెప్పేవారు. ఇలా ఎంతకాలం గడపాలో అతని అర్థంకాలేదు. నేర్చుకుని బాగుపడవలసిన జీవితం అంతా ఇలా దండగయిపోతున్నదనే బాధ అతనిలో ఎక్కువయింది. ఆర్నెల్లకో సంగీతం ముక్క నేర్చుకుంటూ వెట్టిచాకిరీలు చెయ్యడం కంటే ఏ సంగీత కళాశాలలోనే పడితే కాస్త ఆస్కారం వుంటుందనే ఆలోచన వచ్చింది అతనికి. ఆ ఆలోచనతో, తన చేతిన వున్న 40 రూపాయల వుంగరాన్నీ ఎనిమిది రూపాయలకు ఎవడికో ఇచ్చేసి, తల్లితో కూడా చెప్పకుండా విజయనగరానికి రైలెక్కాడు.

విజయనగరంలోని సంగీత కళాశాలకు ద్వారం వెంకటస్వామి నాయుడుగారు ప్రిన్సిపాలు. వెంకటేశ్వరరావు విజయనగరంలో దిగుతూనే, వారింటికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకుని, విషయమంతా నివేదించాడు.

"బాగానే వుంది. ఐతే, ఇప్పుడు కళాశాలకు సెలవులు. అందాకా ఏం చేస్తావు?" అన్నారు నాయుడుగారు.

"ఏదైనా చేస్తాను. మీ సెలవయితే కాలేజీలో వుంటాను. తిండి తిప్పలకు ఎలాగో బాధపడతాను" అన్నాడు వెంకటేశ్వరరావు. నాయుడుగారు సరేనని, కాలేజీలో అతనికి మకాం ఏర్పాటు చేశారు. ఊళ్ళో వారాలు చేసుకుని తింటూ, ఇచ్చినవాళ్ళ దగ్గర చందాలు తీసుకుంటూ కాలక్షేపం చెయ్యసాగాడతను. కాలేజీ కొద్దిరోజుల్లో తెరుస్తారనగా ఓ దుర్ఘటన జరిగింది. కాలేజీలో ఏదో దొంగతనంలాంటిది జరగడం, కాలేజీలో తలదాచుకున్న ఇతర విద్యార్థులూ, నౌకర్లూ కలిసి, ఆ దొంగతనాన్ని వెంకటేశ్వరరావుకు అంటగట్టడం జరిగాయి. దాంతో అతను పదిమందిలోను అనవసరంగా "దొంగ" ఐనాడు. ఆ అపనిందవల్ల కాలేజీలో వున్న బసా పోయింది. ఊళ్ళో వున్న వారాలూ పోయాయి. వెంకటేశ్వరరావు పొట్ట చేత్తో పట్టుకుని చెట్టుకింద నించున్నాడు. తను ఎక్కడికి వెళితే అక్కడ ఎదురవుతున్న దుర్విధిని తలచుకుని విలపించాడు. ఇలాంటి పరిస్థితుల్లో కాలేజీలో తనకు సీటు మాత్రం దొరుకుతుందన్న గ్యారంటీ ఏమిటి? ధైర్యం తెచ్చుకుని కళాశాలలో సంగీతం చెప్పే మాష్టారు ఇంటికి వెళ్ళాడు. ఆయన పేరు పాత్రాయని సీతారామశాస్త్రిగారు. జరిగినదంతా విని, ఆయన వెంకటేశ్వరరావు మీద జాలిపడి, తన యింట ఆశ్రయం ఇచ్చారు. ఒక విధంగా బస బాధ వదిలినందుకు అతను సంతోషించాడు. భుజాన జోలెవేసుకుని, వీధి వీధి ,ఇల్లు ఇల్లూ తిరిగి మధూకరం ఎత్తాడు. కొంత ఉదయం తిని, కొంత రాత్రికి మిగుల్చుకునేవాడు.

నిజం నిలకడ మీద తేలుతుందన్నట్టుగా కాలేజీ తెరచే లోపలే వెంకటేశ్వరరావు నిర్దోషి అన్న విషయం తేలింది. దాంతో అతనిమీద అభాండాలు వేసిన వాళ్ళకు ఉద్వాసన కూడా జరిగింది. సీతారామశాస్త్రిగారు వెంకటేశ్వరరావును ద్వారం వారి దగ్గరకు తీసుకువెళ్ళి అతని పాటనూ, గాత్రాన్నీ వినిపించి, అతనికి కళాశాలలో సీటు లభింపజేశారు. అక్కడి నుంచీ అతను నిర్విఘ్నంగా సంగీతాభ్యాసం చేసి, 1941లో 'విద్వాన్' పట్టం పొందాడు. సీతారామశాస్త్రిగారూ, నాయుడుగారూ వెంకటేశ్వరరావుకు బాగా తోడ్పడ్డారు. రెండున్నర సంవత్సరాలపాటు అతను మధూకరంతోనే కాలక్షేపం చేశాడు. తర్వాత అతనికి మహారాజావారి సత్రంలో భోజన వసతి దొరికింది. ఆఖరు సంవత్సరం విద్యలో వుంటూనే వెంకటేశ్వరరావు నాయుడుగారి అనుమతి తీసుకుని విజయనగరంలో కచేరీలు చేశాడు. విద్వాన్ పట్టం తీసుకున్న తర్వాత చేసిన ఒక కచేరీలో ఆదిభట్ల నారాయణదాసుగారు వెంకటేశ్వరరావుకు ఒక తంబురా బహూకరించారు.

తంబూరా తీసుకుని వెంకటేశ్వరరావు చౌటపల్లి చేరి, కచేరీలు చెయ్యడం, బోధ చెయ్యడం సాగించాడు. నాటకాల్లో వేషాలు వెయ్యడం, నాటకాలు ఆడడం సాగించాడు. ఐనా అతని ఆర్థిక సమస్యలో మాత్రం అభివృద్ధి కనిపించలేదు.

1942 జాతీయోద్యమం వెంకటేశ్వరరావును పిలిచింది. వెంకటేశ్వరరావు తన గాత్రాన్ని పిలిచాడు. అతనూ, గాత్రమూ ఏకమై వీరావేశంతో ఉద్యమంలో ఉరికారు. దాంతో అతనికి శిక్షపడింది. ఆలీపూరు జైలులో సంవత్సరంపాటు వున్నాడు. అక్కడ అతనికి హాయిగానే గడిచింది. జైలు సూపర్నెంటూ, డాక్టరు, వార్డర్లూ అంతా అతని పాటకు దాసోహమైనారు. పొట్టిశ్రీరాములూ, పైక్లాసులో గోపాలరెడ్డి మున్నగువారు జైల్లో అతని సహచరులు.

జైలు జీవితం గడిచిన తర్వాత, వెంకటేశ్వరరావు మోపిదేవి చేరుకున్నాడు. కొంతమంది ఉత్సాహవంతులను చేరదీసి, నాటక కంపెనీ లేవదీసి 'కాళిదాసు', 'సక్కుబాయి', 'చింతామణి', 'వరవిక్రయం' నాటకాలు ఆడాడు.

1945లో వెంకటేశ్వరరావుకు వివాహం జరిగింది. వివాహంతో పెదపులివర్రులో సముద్రాల రాఘవాచార్యులుగారితో పరిచయం ఏర్పడింది. అతని కంఠం విని సినిమాల్లో ప్రయత్నం చెయ్యమని సలహా ఇచ్చినవారు ఆచార్యులుగారే. వెంకటేశ్వరరావుకు వేషాల సరదా ఎక్కువగా వుండేది. ఐతే మద్రాసులో మకాం పెడితే, వేషాలూ వెయ్యవచ్చును, పాటలూ పాడవచ్చును అనుకున్నాడు. ఆ ఆశే అతనిచేత మద్రాసుకు టిక్కెట్టు కొనిపించింది. మద్రాసులో మళ్ళీ ఇక్కట్టులు ఆరంభమయినై. వెంకటేశ్వరరావు పాట విని అంతా మెచ్చుకునేవాళ్ళేగాని ప్రోత్సహించినవాళ్ళు లేరు. రాఘవాచార్యులగారి ఉత్తరాలతో అతను తిరగని సినిమా ఆఫీసూ లేదు. చూడని నిర్మాతా లేడు.

మూడు నెలలపాటు అలా తిరగ్గా తిరగ్గా ఘంటసాల బలరామయ్యగారు, వెంకటేశ్వరరావును 'సీతారామజననం'లో 'వేషాలు' వెయ్యడానికిగాను నెలజీతం మీద తీసుకున్నారు. ఆ చిత్రంలో అతను అనేక చోట్ల అనేక రకాలుగా కనిపించాడు.

ఆ సమయంలోనే అతను 'హిస్ మాస్టర్స్ వాయిస్' కంపెనీకి వెళ్ళి గ్రామఫోను రికార్డులు ఇవ్వడానికి ప్రయత్నం చేశాడు. అతని గొంతు విని హెచ్. యం.వివాళ్ళు "నీ గొంతు మైక్‌కు పనికిరాదు" అని సర్టిఫికెట్ ఇచ్చి పంపేశారు. ఐతే బాలాంత్రపు రజనీకాంతారావు ప్రోత్సాహంతో అతను ఆలిండియా రేడియోలో తరచు పాల్గొనేవాడు.

'సీతారామ జననం' తర్వాత వెంకటేశ్వరరావు నాగయ్యగారి 'త్యాగయ్య' చిత్రంలో పని చేశాడు. ఆ తర్వాత నాగయ్యగారే వెంకటేశ్వరరావుకు 'స్వర్గసీమ' చిత్రంలో అవకాశం కల్పించారు. ఆ చిత్రంలో అతను భానుమతితో కలిసి "ఓహో నా రాజా" అన్న పాటను పాడాడు. తెరమీద భానుమతి, నారాయణరావు పాడారు.

భానుమతి, రామకృష్ణ కలిసి భరణి సంస్థ స్థాపించి 'రత్నమాల' తీయడానికి సంకల్పించారు. ఆ చిత్రానికి సుబ్బరామన్ సంగీత దర్శకుడు. సుబ్బరామన్ దగ్గర సహాయకునిగా పనిచేసే అవకాశం కలిగింది. వెంకటేశ్వరరావుకు. సుబ్బరామన్ ఇచ్చిన ప్రోత్సాహంతో అతను ఆ చిత్రంలో కొన్ని పాటలకు స్వరకల్పన చేశాడు. తర్వాత 'బాలరాజు'కు సహాయకుడిగా చేరి, అక్కడ కొన్ని పాటలకు స్వరకల్పన చేశాడు. ఇంక అప్పుడే, వెంకటేశ్వరరావు 'మధురగాత్రం'

పరిశ్రమలో వినిపించసాగింది. సహాయ సంగీత దర్శకునిగా అతని ప్రజ్ఞ కనిపించసాగింది. ఆ ప్రజ్ఞే వెంకటేశ్వరరావును "లక్ష్మమ్మ" చిత్రానికి సంగీత దర్శకత్వం వహించాడు.

'కీలుగుర్రం' చిత్రం విజయం పొందడంతోపాటు, చిత్రంలోని పాటలన్నీ విజయవంతమైనాయి. 'కాదుసుమా కలకాదు సుమా' , 'ఎంత కృపామతివే ' మొదలైన పాటలన్నీ ఆంధ్రదేశంలో మారుమ్రోగాయి. దాంతో వెంకటేశ్వరరావు కంఠం కూడా మారు మ్రోగింది. ఆ విధంగా వెంకటేశ్వరరావు "ఘంటసాల"గా ప్రతినోటా వినిపించారు.

ఆ సమయంలోనే "ఘంటసాల బాణీ" అంటూ వచ్చిన కరుణశ్రీగారి పద్యాలు, ఎంత ప్రచారం పొందాయో చెప్పలేము. పద్యాన్ని భావయుక్తంగా, హాయిగా తియ్యగా ఎలా పాడాలో నేర్పి ఒక 'విప్లవాన్ని' తెచ్చారు ఘంటసాల. పాట పాడడంలో ఏ అక్షరం ఎలా నొక్కి భావయుక్తం చెయ్యాలో నేర్పిన వారు ఘంటసాల. పాటలోని సంగీతానికీ, సాహిత్యానికీ వున్న సాన్నిహిత్యాన్ని నిరూపించి, సాహిత్యాన్ని సాహిత్యంగా చూసిన వారు ఘంటసాల.

విజయా సంస్థలో ఘంటసాల సంగీత దర్శకునిగా చేరి ఉత్తమ సంగీత దర్సకునిగా మళ్ళీ మళ్ళీ నిరూపించుకున్నారు. నటుడిగా వచ్చిన వ్యక్తి, నేపథ్యగాయకుడు, సంగీత దర్శకుడూ కావడానికి కారణం అతని ప్రజ్ఞా విశేషాలే. అతని సంగీతాన్ని సినిమా పరిశ్రమ ఆదరిస్తుందని మొదట్లో ఆయన అనుకోలేదు. అందుకే నటుడిగానైనా వద్దామనుకున్నారు. భక్తిశ్రద్ధలతో కృషిచేసి సాధించిన "ప్రజ్ఞ" ఎప్పటికైనా గుర్తింపబడుతుంది కాబట్టి ఘంటసాల ప్రజ్ఞకు అంత విలువ కలిగింది.

ఇంతవరకూ ఆయన ఏడువేల సినిమా పాటలు తెలుగు తమిళ కన్నడ మలయాళ హిందీ సింహళ భాషల్లో పాడారు. 85 చిత్రాలకు 'సంగీతం' సమకుర్చారు.

ఆయన పొందిన సన్మానాలూ, అభినందనలూ ఇన్నీ అన్నీ కావు. 1962లో ఘంటసాల రాష్ట్రపతి సమక్షంలో కచేరీ చేసినప్పుడు, ప్రభుత్వాధికారులూ, విదేశీయులూ అనేకమంది విన్నారు. ఆ సందర్భంలోనే మన సాంస్కృతిక సంఘం తరపున, మన సంగీతాన్ని విదేశాలలో వినిపించాలనే సంకల్పం ప్రభుత్వానికి కలిగింది. 1963లో పుష్పగిరి పీఠాధిపతులు ఘంటసాలకు 'గాయకసార్వభౌమ' బిరుదు ఇచ్చారు.

"ఏ కీర్తనైనా, ఏ పాటయినా, అది శాస్త్రీయమైనా, లలితమైనా భావయుక్తంగా పాడాలనేది నా ఉద్దేశం. కేవలం సంగీతమయం చేసి, భాషకూ, భావానికీ అన్యాయం చేసే సంగీతం, సంగీతం కాదని నా నమ్మకం. విదేశ సంగీతమైనా, స్వదేశ సంగీతమైనా బాగుందనుకున్నప్పుడు మనం తీసుకోవలసిందే. మంచి ఎక్కడున్నా తీసుకుంటున్నప్పుడు, సంగీతం మాత్రం ఎందుకు తీసుకోరాదు" అంటారు ఘంటసాల.

తన సంగీత సంప్రదాయాన్ని నిలబెట్టగల ఒక సంగీత కళాశాలను స్థాపించాలన్నది ఘంటసాలగారి జీవితాశయం. ఈ ఆశయ సిద్దికోసం ఆయన ఏర్పాట్లు ఆరంభించారు .అవి కార్యరూపం ధరిస్తున్నాయి.

Post your comments